క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు రూరల్: చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన రద్దు

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 4వ తేదీ చిత్తూరుకు వస్తున్న నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగే స్పందనను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

కాటమరాజుస్వామికి ప్రత్యేక పూజలు

బంగారుపాళెం: మండలంలోని కల్లూరుపల్లెలో ఆదివారం కాటమరాజులుస్వామి ఆలయంలో మండల పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కాటమరాజుస్వామి వారికి పెద్దసంఖ్యలో పరిసర గ్రామస్తులు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పచ్చనపల్లెలో కరెంట్‌షాక్‌తో కూలీ మృతి

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం పచ్చనపల్లి గ్రామంలో కరెంట్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు, రాజ్‌వేల్ (55) దినసరి కూలీ. ఇంట్లో మోటార్ స్విచ్ వేసే సమయంలో కరెంటు షాక్‌కు గురై, అక్కడికక్కడే కుప్పకూలాడు. ఈ విషయాన్ని గమనించిన చుట్టూ పక్కల కుటుంబీకులు వెంటనే ఆ వ్యక్తిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. భార్య అనారోగ్యంతో నాలుగేళ్ల క్రితమే మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పలమనేరు: పట్టణంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి సమీపంలో విష్ణుప్రియ హోటల్ వెనుక ఆదివారం చెత్తకు నిప్పుపెట్టడంతో పక్కనే ఉన్న మరో గృహంలో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు ఫైర్ కార్యాలయానికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేసి పెను ప్రమాదాన్ని కాపాడారు.

ముగిసిన కపిలేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహించిన పవిత్రోత్సవాలు ఆదివారం మహా పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాలపూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టు పవిత్ర సమర్పణ చేపట్టారు. సాయంత్రం సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరస్వామి వారి వీధి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. భక్తులకు పవిత్రమాల, తీర్థప్రసాదాలు అందజేశారు.

లోకకల్యాణార్థం.. చతుర్వేద హవనం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవన ప్రాంగణంలో నిర్వహిస్తున్న శ్రీనివాస చతుర్వేద హవనం ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు కుప్పా విశ్వనాథశర్మ మాట్లాడుతూ యజ్ఞ యాగాదులను దర్శించడం ద్వారా సకల శుభాలను పొందవచ్చన్నారు. మంత్రపూర్వకంగా అగ్నిలో ఆహుతులను సమర్పిస్తే సిరిసంపదలు చేకూరుతాయని వెల్లడించారు. ఈ క్రమంలో వేదపండితులు ఉదయం చతుర్వేద హవనం, మధ్యాహ్నం చతుర్వేద పారాయణం నిర్వహించారు. సాంస్కృతిక వేదికపై ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల బృందం ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం ఆకట్టుకుంది. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు ఎస్.శ్రీవాణి బృందం ప్రదర్శించిన వీణావాద్య సంగీత కచ్చేరి శ్రవణానందకరంగా సాగింది.

పల్లె ముంగిటకు వైద్య సేవలు

- ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం భరోసా
- వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లపై ప్రజలు హర్షం



సీవీ పల్లె వైఎస్సార్ విలేజ్ క్లినిక్

ఐరాల: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. గతంలో వైద్య సేవల కోసం గ్రామీణ ప్రజలు పట్టణాలకు వెళ్లేవారు. ఆర్థిక స్థోమత లేనివారు దీర్ఘవ్యాధుల బారిన పడి చికిత్స చేయించుకోలేక మంచానికే పరిమితయ్యేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు తీసుకొచ్చారు. గ్రామం నుంచి ఒకటి, రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యా కేంద్రానికి (పీహెచ్‌సీ)కి వెళ్లనవసరం లేకుండా గ్రామాంలోనే వైద్యసేవలు, వైద్య పరీక్షలు పొందేందుకు వీలుగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గ్రామాల్లో ఉండే వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఈ సెంటర్ల ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. వీటి ద్వారా కొన్నేళ్లుగా వైద్యం అందని గ్రామాలు, 108, 104 వాహనాలు వెళ్లని గ్రామాల్లో కూడా నేడు చికిత్సలు అందుతున్నాయి. అంతే కాకుండా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఆస్పత్రికి వెళ్లలేని రోగుల వద్దకు డాక్టర్లే వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు.

ఐరాల మండలంలో 12 క్లినిక్‌లు

మండలంలో 12 విలేజ్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. వీటిలో 3 క్లినిక్‌లు పూర్తయ్యాయి. మిగిలిన 9 వివిధ దశాల్లో ఉన్నాయి. క్లినిక్‌ల భవన నిర్మాణాలకు రూ.17.50 లక్షలు కేటాయించారు.

ఉచితంగా 105 రకాల మందులు

సుమారు 2 వేల నుంచి 3 వేల జనాభా కలిగిన ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఉంటుంది. సెంటర్‌లో 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు (ఎంఎల్‌హెచ్‌పీ) మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్, గ్రామ సచివాలయ ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు అందుబాటులో ఉంటారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. అలాగే షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు చేసేందుకు అత్యాధునిక కిట్లు ఏర్పాటు చేశారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు భవనాలు పూర్తి కాని చోట్ల గ్రామ సచివాలయల్లో, అద్దె భవనాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వృద్ధులు, గర్భిణులకు నిరంతరం వైద్యబృందం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. సెంటర్‌కు వచ్చే రోగులను ఎంఎల్‌హెచ్‌పీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వారి ఆరోగ్యం మెరుగుపడే వరకు వైద్య సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఈ సెంటర్ పరిధిలో నెలలో రెండు పర్యాయాలు ప్రభుత్వం నియమించిన డాక్టర్లు 104 వాహనం ద్వారా వచ్చి వైద్యసేవలు అందిస్తారు. హెల్త్ వెల్‌నెస్ సెంటరు పరిధిలో ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్న రోగులను, పక్షవాతం, ఇతర రోగాలతో మంచానికి పరిమితమై కేంద్రాల వద్దకు రాలేని పరిస్థితిలో ఉన్న రోగులను పరీక్షించేందుకు ఇంటింటికీ వెళ్లి డాక్టర్లు సేవలు అందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా నెలకు రెండు పర్యాయాలు వైద్య సేవలు అందించేందుకు వచ్చే డాక్టర్‌తో ఏదైనా అత్యవసర సమయాల్లో వైద్య సలహాలు తీసుకునేందుకు సెల్‌ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ఫోన్ నంబరు కూడా అందుబాటులో ఉంచారు.

వైద్యం బాగుంది



గతంలో చిన్న రోగానికి కూడా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో దూరం తగ్గి ఇక్కడే చికిత్స పొందుతున్నాం. నేను నాలుగు నెలల నుంచి షుగర్ వ్యాధికి చికిత్స పొందుతున్నాను. వైద్యులు, సిబ్బంది బాగా చూస్తున్నారు.

–కోదండరెడ్డి, సీవీ పల్లె, ఐరాల

అన్ని ఉచితంగా చేస్తున్నారు



వృద్ధాప్యంలో అనేక ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన తర్వాత చాలా వరకు ఆ ఇబ్బందులు తొలగాయి. చిన్న రోగం వచ్చినా వెంటనే ఇక్కడికి వచ్చి చికిత్స పొందుతున్నాం. ఇక్కడ వైద్య పరీక్షలు, మందులు అన్ని ఉచితంగా ఇస్తున్నారు.

–సులోచనమ్మ, సీ.వి.పల్లె, ఐరాల

14 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నాం



హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చే రోగులకు ప్రాథమిక వైద్యసేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. పూర్తిస్థాయిలో ఆరోగ్య సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. 105 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు చేస్తారు. గర్భిణులు, వృద్ధులు, చిన్న పిల్లలకు గ్రామంలోనే వైద్యం పొందవచ్చు.

–ప్రవీణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, ఐరాల

నేడు జగనన్న సురక్ష గ్రామసభ

బంగారుపాళెం: బంగారుపాళెం గ్రామ సచివాలయం–2లో సోమవారం జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభం అవుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలు దరఖాస్తు చేసుకున్న ధ్రువ పత్రాలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామసభకు హాజరు అవుతారన్నారు.

డెయిరీ వద్ద ఏర్పాట్ల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా విజయ డెయిరీ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం నగర కమిషనర్ జె.అరుణ పర్యవేక్షించారు. డెయిరీ ఆవరణలో శిలాఫలకం వద్ద టైల్స్ ఏర్పాటు, ప్లాట్‌ఫామ్ నిర్మాణం, పరిసరాల వద్ద శుభ్రత పనులను తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.



మేము కుర్రాళ్లామే.. మా మజానే వేరంటూ వేగంగా పరుగులు వెళుతున్న ట్రాక్టర్‌పై పోజులిచ్చారు. ట్రాక్టర్ ముందు భాగంలోని ఇనుక కడ్డీపై కూర్చుని రైట్..రైట్ అంటూ హల్‌చల్ చేశారు. ప్రమాదమని తెలిసినా దర్జాగా ప్రయాణాన్ని కొనసాగించారు. ఈ అత్యుత్సాహం ఎందుకని.. జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులంటూ రోడ్డున్న వెళ్లేవారు, గ్రామస్తులు కేకలు పెట్టారు. పట్టించుకోని ఆ కుర్రాళ్లు రెండు కి.మీ మేర ప్రయాణం చేశారు. ఈ చిత్రం చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో సాక్షి కెమెరాకు చిక్కింది. విచారిస్తే.. వీరంతా మామిడి కోతకు వచ్చి ట్రాక్టర్‌లో మామిడికాయలు లోడ్ చేసి ఇలా ఫీట్లు చేశారని గ్రామస్తులు తెలిపారు.

–చిత్తూరు రూరల్

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



అభిషేక పూజలు చేస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్: గురు పౌర్ణమిని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీవిశ్వ షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. బాబాకు 116 రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అలాగే కాకడ హారతి, మధ్యాహ్న హారతి, సంధ్యా హారతి, శేజ్ హారతి చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. నిర్వాహకులు సీకే లావణ్య పర్యవేక్షించారు.

గరుడ వాహనంపై సీతారాములు



గరుడ వాహనంపై దర్శనమిస్తున్న కల్యాణరాముడు





కోదండరాముల దేవస్థానంలో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం, పాల్గొన్న భక్తులు

- అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం
- భక్తజనసంద్రంగా టి.పుత్తూరు
- నేడు గజవాహన సేవ

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండరాముల దేవస్థానంలో ఆదివారం గరుడుసేవ, సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకం చేశారు. అనంతరం ఉభయదారులు సీత, రాములకు పట్టువస్త్రాలు, సారె, కల్యాణ సామగ్రిని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు సీతారాముల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని వేదమంత్రాలు పఠిస్తూ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు సీతారాముల కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. అనంతరం భక్తులు చదివింపులు వేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉభయదారులచే కల్యాణతిరుక్కోణం, ఊంజల్ సేవ నిర్వహించారు.

గరుడ వాహనంపై భక్తులను కటాక్షిస్తూ..

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గరుడవాహన సేవను అర్చకులు ఘనంగా నిర్వహించారు. అర్చకులు శ్రీరాముడి ఉత్సవమూర్తి అభిషేకాది పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం గరుడ వాహనంపై అధిష్ఠించిన శ్రీరామచంద్రమూర్తి భక్తులను కటాక్షిస్తూ ముందుకు సాగారు. భక్తులు స్వామివారికి కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర, మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేటి సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఉభయదారులచే తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రిలో గజ వాహన సేవ నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం





కార్వేటినగరంలో అగ్నిగుండం ప్రవేశం చేస్తున్న భక్తులు, తరలి వచ్చిన భక్తజనం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కార్వేటినగరం: మండలకేంద్రంలో వెలసిన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం అమ్మవారి అగ్నిగుండం ప్రవేశంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు కర్పూర హారతులు పట్టారు. అదేవిధంగా మహిళలు అమ్మవారికి పొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం కంకణాలు ధరించిన భక్తులు కుమారగిరి సమీపంలో ఉన్న స్కంధపుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన పవిత్ర గంగా జలంతో స్నానం ఆచరించారు. అనంతరం పసుపు వస్త్రాలు ధరించి చేతిలో వేపాకులు పట్టి అమ్మవారితో పాటు ఊరేగింపుగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం వద్దకు చేరుకున్నారు. తరువాత అమ్మవారికి అర్చకులు అగ్గితో వడిబాల కట్టి అమ్మవారి విగ్రహంతో అగ్నిగుండంలో ప్రవేశించగా భక్తులు కూడా ఆమెతో పాటే అగ్నిగుండంలో దిగారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామస్తులు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ఆవరణలు కిటకిటలాడాయి. అగ్నిగుండ ప్రవేశానికి బలిజ కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షుడు శివప్రకాష్, కోశాధికారి బాబురెడ్డి, ఉప కోశాధికారి కృష్ణయాదవ్, భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ దస్తగిరి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

శరీరం సహకరించదు.. పనిచేస్తే అలసట

- అత్యంత అరుదైన మయస్తీనియా గ్రేవిస్ వ్యాధి
- వేధిస్తున్న కండరాల బలహీనం

కొద్ది దూరం నడిస్తే శరీరం సహకరించదు. కొద్దిసేపటికే తీవ్ర అలసట వస్తుంది. మెట్లు ఎక్కలాంటే నరకమే. కనురెప్పలు వాలిపోతుంటాయి. దృష్టి రెండుగా కనిపిస్తుంది. ఆహారాన్ని కూడా సరిగ్గా నమలలేని పరిస్థితి. ఇవన్నీ అరుదైన మయస్తీనియా గ్రేవిస్ వ్యాధి లక్షణాలు. ఇటీవల కాలంలో పలువురిలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి.



చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో క్యూలో ఉన్న రోగులు

చిత్తూరు రూరల్: జిల్లాలో మయస్తీనియా గ్రేవిస్‌తో బాధపడే వారి సంఖ్య చాలా అరుదుగా కనిపిస్తుంది. చాలా మంది ఈ వ్యాధితో బాధపడుతున్నా వారికి ఈ వ్యాధి ఉన్నట్లు కూడా అవగాహన ఉండదు. ఈ వ్యాధిపై చాలా మంది వైద్యులకు కూడా సరైన అవగాహన లేకపోవడంతో లక్షణాలను బట్టి చికిత్స ఇస్తున్నారు. నిపుణులైన వైద్యులు మాత్రమే ఇలాంటి అరుదైన వ్యాధులను గుర్తించి చికిత్స అందించే అవకాశం ఉంది. జిల్లాలో ఈ వ్యాధితో 1,500 దాకా ఉన్నట్లు అంచనా. ప్రతి లక్ష మందిలో 40 నుంచి 50 మంది దాకా ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

మయస్తీనియా గ్రేవిస్ అంటే..

కండరాలు బలహీనంగా, సులభంగా అలసిపోయేలా చేసే వైద్య పరిస్థితినే మయస్తీనియాగా పిలుస్తారు. ఇది కండరాలు, నాడుల మధ్య సంబంధాన్ని దెబ్బతీసి నియంత్రణను కోల్పోయేటట్లు చేస్తుంది. భోజనం మధ్యలో ఉన్నప్పుడు మీ దవడ కండరాలు అలసిపోవడం, బలహీనపడడం వంటి సమస్య కనిపిస్తుంది. ఆహారాన్ని నమలడం కష్టమవుతుంది. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత కండరాలు మళ్లీ బలపడతాయి. అప్పుడు మళ్లీ మీరు తినవచ్చు. కండరాలు ఇలా బలహీనపడడం, విశ్రాంతితో మెరుగుపడడం, ఉపయోగంతో మరింత క్షీణించడం వంటివి మయస్తీనియా గ్రేవిస్‌లోని సంకేతాలు. ఈ వ్యాధితో బాధపడేవారిలో ఈ లక్షణాలు అధ్వానంగా మారే సమయాలను గుర్తించవచ్చు. కొన్నిసార్లు ఈ లక్షణాలు తగ్గవచ్చు లేదా అదృశ్యం కావచ్చు. ఈ వ్యాధి ఏ వయస్సు వారికైనా రావచ్చు. కానీ 40 ఏళ్ల కంటే తక్కువ వయస్సున్న మహిళలు, 60 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సున్న పురుషులకు ఎక్కువగా వస్తుంది.

కండరాలకు సంబంధించిన ఓపీ వివరాలు

నెల	ఓపీ సంఖ్య
మార్చి	3,150
ఏప్రిల్	2,945
మే	3,011

వ్యాధి లక్షణాలు

- కొద్దిదూరం నడిస్తే శరీరం సహకరించదు. మెట్లు ఎక్కడానికి కూడా ఇబ్బంది పడతారు.
- దాదాపు 50 శాతం మయస్తీనియా గ్రేవిస్ కేసుల్లో మొదటి సంకేతాలు, లక్షణాలు కంటి కండరాల్లో కనిపిస్తాయి. కొన్నిసార్లు ఒకటి లేదా రెండు కనుబొమ్మలు వాలిపోతాయి. మరికొందరికి దృష్టి రెండుగా కనిపిస్తుంది.
- 15 శాతం కేసుల్లో ముఖం, గొంతు కండరాలపై ప్రభావం చూపుతుంది. బలహీనంగా మాట్లాడడం .. మాట విభిన్నంగా ఉండడం, నమలడం, మింగడం, తాగడం, తినడం కష్టంగా మారుతుంది.
- కొన్నిసార్లు మీరు మింగేందుకు ప్రయత్నించే ద్రవాలు ముక్కు నుంచి బయటకు రావచ్చు. కొన్నిసార్లు ముఖకవళికలు భిన్నంగా కనిపించడానికి కారణం కావచ్చు.

నిర్ధారణ పరీక్షలు

రోగి కండరాల స్థాయి, స్పర్శ, ప్రతిచర్య, సమన్వయం, కండరాల బలం, సమతుల్యతను పరీక్షించడం ద్వారా నరాల ఆరోగ్యాన్ని వైద్యులు పరిశీలిస్తారు. అసాధారణ యాంటిబాడీస్‌ను గుర్తించేందుకు రక్త పరీక్ష చేస్తారు.

ముందు జాగ్రత్తతోనే నివారణ



మయస్తీనియా గ్రేవిస్‌క్ తొలి దశలోనే గుర్తిస్తే మంచిది. అవగాహన లేమితో చాలా మంది ఇష్టానుసారంగా మందులు వాడుతున్నారు. ఇది మంచిది కాదు. డాక్టరు సూచనలు, సలహాలు తీసుకుని మందులు వాడాలి. లేని పక్షంలో వ్యాధి మరింత బలపడే అవకావం ఉంటుంది. ముందుగా ఈ వ్యాధిని గుర్తిస్తే నియంత్రణ సులభమవుతుంది.

–డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, చిత్తూరు

సర్పాల సయ్యాట



పెనవేసుకుని బుస కొడుతున్న సర్పాలు

నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం ప్రకాష్ నగర్ గుబురుగా ఉన్న చెట్ల సమీపంలో ఉన్న ఇంటి బాత్రూంలోకి మూడు పాములు చొరబడడంతో ఆ ఇంట్లో వారితో పాటు స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పాములను అక్కడి నుంచి పంపేందుకు వారు ప్రయత్నించగా చెట్ల మధ్యలోకి వెళ్లి రెండు పాములు కలసి పెనవేసుకుని బుస కొట్టడంతో భయాందోళన చెందారు. ఇంటి యజమానులు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించగా వారు పుత్తూరు నుంచి స్నేక్ క్యాచర్ శ్రీకాంత్‌ను రప్పించారు. అప్పటికే పాములు బాత్రూంలో నుంచి పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లాయి. వాటిని పట్టుకోవడానికి స్నేక్‌క్యాచర్ తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకపోయింది. అయితే పాములు ఆ ప్రాంతంలోనే అక్కడే సంచరిస్తున్నాయని, తక్షణం పొదలను శుభ్రపరిస్తేనే వాటిని పట్టగలమని స్నేక్ క్యాచర్ మున్సిపల్ అధికారులకు సూచించారు.